క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాంధీనగర్‌లో రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో రోడ్ల నిర్మాణం కోసం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీనగర్ పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.33 లక్షలు జీవీఎంసీ నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటికే ఈ కాలనీలో కొన్ని వీధుల్లో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ పనులు నాణ్యతతో జరిపించాలని జీవీఎంసీ వర్క్స్ ఏఈ వెంకటరావును ఆమె ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో రూ.6 కోట్ల నిధులతో జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మాణంలో ఉందన్నారు. గెడ్డలు ఆధునికీకరణ, బ్రిడ్జిల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బెతనీ స్కూల్ స్పోర్ట్స్ డే



పోటీలను తిలకిస్తున్న పవన అంచేస్

బీచ్‌రోడ్డు: బెతనీ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలను పోలీసు స్టేడియం గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముంబైకు చెందిన బీజేపీపీసీ జూనియర్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ పవన అంచేస్ మాట్లాడుతూ బెతనీ స్కూల్‌లో నాణ్యతమైన విద్యతో పాటు విద్యార్థులకు ఆటల్లో కూడా ప్రావీణ్యత పొందేలా అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్, క్రిస్మస్ డ్యాన్స్ చేసి అలరించారు. అనంతరం వివిధ పోటీల్లో 1500 విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు అనిత, హెడ్ మాస్టర్ పీటర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బీచ్ రోడ్డు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగాపురం కాలనీ 11 కేవీ ఫీడర్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీపాలెం, పీఠానివానిపాలెం, చిన్ని కృష్ణ గుడి, సాయిబాబా గుడి, ఆరు కుళాయిల జంక్షన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం



లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన లక్ష్మీకాంతం

ఎంవీపీ కాలనీ: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలి మృతి చెందిన ఘటన ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎంవీపీ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్రిపాలేనికి చెందిన బైరెడ్డి లక్ష్మీకాంతం(65), రాములు(70) దంపతులు ఎండాడలోని ఓ ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఇసుకతోట వద్దకు చేరుకునే సరికి వేగంగా వెనక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. దీంతో భార్యభర్తలు రోడ్డుపై పడిపోగా లారీ ముందు చక్రం లక్ష్మీకాంతంపైకి ఎక్కేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని లారీ డ్రైవర్ జగ్గయ్య(52)ను అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మీకాంతం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో లారీని నడపడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సీఐ ప్రసాద్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి

స్మార్ట్ లుక్



స్మార్ట్ టాయిలెట్స్

సాగరతీరంలో మౌలిక వసతుల కల్పన

అందుబాటులోకి టాయిలెట్స్, ఆటోలు, పోలీస్ అవుట్‌పోస్ట్

బీచ్ రోడ్డు: విశాఖ అంటే సాగరతీరం.. బీచ్ అందాలను చూసేందుకు రోజూ వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి. గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పర్యాటకులకు పెద్ద పీట వేస్తూ ఎన్నో ప్రాజెక్టులు చేపట్టింది. సాగరతీరాన్ని స్మార్ట్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసింది. స్మార్ట్ టాయిలెట్స్.. ఉచితంగా ఎలక్ట్రికల్ వాహనాలు, టూరిజం భద్రత కోసం పోలీసు అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు.

స్మార్ట్ పోలీసు స్టేషన్

పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వచ్చిన సందర్శకుల భద్రత కోసం టూరిజం పోలీసు స్టేషన్‌ను సాగరతీరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ నిరంతరం ఇద్దరు పోలీసులు సందర్శకులకు అందుబాటులో ఉంటారు. అలాగే సుమారు రూ.28 లక్షలతో పర్యాటక ప్రాంతాల్లో నిరంతరం గస్తీ కాసేందుకు 10 ద్విచక్ర వాహనాలను, తీరంలో రెండు మినీ ట్రాక్టర్లను కూడా పోలీసులు వినియోగిస్తున్నారు.

రూ.20 లక్షలతో స్మార్ట్ టాయిలెట్స్

విలాసవంతమైన భవనంలో మరుగుదొడ్లు, స్నానం గదులు ఎలా ఉంటాయో అటువంటి సదుపాయాలతో కూడిన స్మార్ట్ టాయిలెట్స్‌ను రూ.20 లక్షల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం సాగరతీరంలో ఏర్పాటు చేసింది. వెస్టర్న్ బాత్ రూమ్స్, సముద్ర స్నానం అనంతరం స్నానం చేసుకునేందుకు హాట్ వాటర్, షవర్ బాత్ అందుబాటులో ఉంటాయి. ఈ



టూరిజం పోలీసు స్టేషన్

ఎలక్ట్రికల్ వాహనాల్లో ఉచిత రవాణా

సాగరతీరంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని చూసేందుకు సందర్శకులు రవాణాకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక సంస్థతో ఒప్పందం చేసుకుని 10 ఎలక్ట్రికల్ ఆటో వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆటోల ద్వారా సందర్శకులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. ఇవి కోస్టల్ బ్యాటరీ నుంచి సాగర్‌నగర్ వరకు రోజుకు 10 ట్రిప్పుల చొప్పున 100 ట్రిప్పులు తిరుగుతాయి.





టాయిలెట్‌లో వెస్టర్న్ వసతులు

స్మార్ట్ టాయిలెట్స్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులకు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఇటువంటి స్మార్ట్ టాయిలెట్స్‌ను విశాఖలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఉచిత ప్రయాణ సదుపాయం బాగుంది..



ఆర్కే బీచ్ నుంచి సాగర్‌నగర్ మధ్యలో సందర్శించడానికి చాలా ప్రదేశాలు, మ్యూజియంలు ఉన్నాయి. సొంత వాహనాలు లేకపోతే అధిక మొత్తంలో ఆటో చార్జీలు చెల్లించాల్సి వచ్చేది. కానీ జీవీఎంసీ అధికారులు ఎలక్ట్రికల్ ఆటోల ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం చాలా బాగుంది. అన్ని పర్యాటక ప్రాంతాలను తక్కువ సమయంలో సందర్శించగలిగాం. సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అయింది.

– నిపుమా, సందర్శకురాలు

మౌలిక వసతులు సూపర్



బీచ్ చూడడానికి వెళ్లిన వారిలో చాలా మంది సముద్రం స్నానాలు చేస్తారు. తరువాత శుభ్రం చేసుకునేందుకు దగ్గరలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన స్మార్ట్ టాయిలెట్స్ సూపర్‌గా ఉన్నాయి. విలాసవంతమైన భవనంలో ఉండే మరుగుదొడ్లు, స్నానం గదులు ఇక్కడ ఉన్నాయి.

– ధనుంజయ్, సందర్శకుడు

వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా మందారెడ్డి బాధ్యతల స్వీకరణ



జూలో సత్తి మందారెడ్డిని సత్కరించి చిత్రపటం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తి మందారెడ్డి జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా జూలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయనను జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీంతో జూ క్యూరేటర్ నందనీ సలారియా సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జూ అధికారులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను అభినందించారు. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, పి.ఐ.బాలరాజు ఆయనను సత్కరించి చిత్రపటం బహూకరించారు.

ఈ సందర్భంగా మందారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అటవీ శాఖ అధికారులకు తమ సహకారం అందించడంతో పాటు జూ పార్కు అభివృద్ధిలో భాగస్వామినవుతానన్నారు.

జూకి యథావిధిగా సోమవారం సెలవు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు యథావిధిగా సోమవారం సెలవు కొనసాగనుందని క్యూరేటర్ నందనీ సలారియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల కార్తీక మాసం పురస్కరించుకుని సోమవారానికి బదులుగా బుధవారం జూ పార్కుకు సెలవు ప్రకటించి నాలుగు వారాలు పాటు కొనసాగించిన విషయం తెలిసిందే. కార్తీక మాసం ముగియడంతో ఎప్పటిలాగే ఈనెల 18 నుంచి సోమవారం సెలవు కొనసాగుతుందని క్యూరేటర్ తెలిపారు. బుధవారం జూ తెరిచి ఉంటుందన్నారు.

'ప్రజా సంక్షేమం, యువతకు ప్రోత్సాహం'

ఏయూ క్యాంపస్: ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్‌ఆర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల నిషేక్ అన్నారు. శనివారం ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వెనుకబడిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేపడుతున్న సంక్షేమ పథకాలు నేడు ప్రజల జీవన ప్రమాణాలను ఎంతగానో మెరుగుపరుస్తున్నాయన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. విద్య, వైద్యం, సొంతింటి బాధ్యతను తీసుకుని ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలలో పేదలందరికీ మేలు చేసిందన్నారు. తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించడంపై ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ విద్యార్థి నాయకులు డాక్టర్ ఎం.కల్యాణ్, డాక్టర్ మోహన్‌బాబు, కర్నేటి సాయికృష్ణ, రాజ్‌కుమార్, మాధవ్, చరణ్, జగన్, అజయ్, అచ్యుత్, శశాంక్, బాలాజీ, సుధీర్ పాల్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



17వ వార్డులో పథకాల గురించి అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ లావణ్య



12వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రోహిణి, తదితరులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే సాధ్యమవుతుందని 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీ పరిధిలో 17వ వార్డు నేతాజీ పార్కు ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్ నాయకత్వం రాష్ట్రానికి ఎందుకు కావాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. తొలుత పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. పెదగదిలిలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్థానిక నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కొండమ్మ, కనకరాజు, హుస్సేన్, సూర్యారావు, వినోద్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు



శివాలయం ఆవరణలో భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



స్వామీజీని సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక అప్పుఘర్‌లో శ్రీవెంకటేశ్వర గోవింద మాల దీక్ష పీఠం శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ధనుర్మాసం ప్రారంభోత్సవంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించడం హర్షణీయమని స్వామీజీ పేర్కొన్నారు. అనంతరం స్వామిజీని ఎంపీ ఎంవీవీ, నిర్వాహకులు గజమాలతో సత్కరించారు.

శివాలయంలో..

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు నెహ్రూనగర్‌లో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, బోని శివరామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- 13వ వార్డులో రెండో రోజుకు ఎంపీ ఎంవీవీ పాదయాత్ర



ఆపరేషన్ కాలనీలో పాదయాత్ర చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ మమ్మల్ని గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తూర్పు నియోజకవర్గంలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తలపెట్టిన పాదయాత్ర 13వ వార్డులో రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంవీవీతో కలిసి సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆపరేషన్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, పాండురంగాపురం, వెర్నిదుర్గానగర్‌లో పాదయాత్ర కొనసాగించారు. వైవీ సుబ్బారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అవసరమో వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మేలు కలిగించే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. వాటి వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఆ పథకాల ప్రచారంతోనే వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్తుందన్నారు. ఆ పథకాలే వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మంచి బలం ఉందన్నారు. ఎంవీవీ సత్యనారాయణకు ప్రజాదరణ పెరుగుతోందని తెలిపారు. అనంతరం ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మత్స్యకార సంక్షేమ విభాగం చైర్మన్ పేర్ల విజయచందర్, కార్పొరేటర్లు కెల్ల సునీత, అక్కరమాని రోహిణి, స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కెల్ల సత్యనారాయణ, వీర్రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అధ్వాన కాలువకు మోక్షం



డ్రైనేజీ లీకును పరిశీలిస్తున్న దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు ఊట గెడ్డ ప్రాంతంలో అధ్వాన కాలువలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ కాలువలోని నీరు ఎప్పటికప్పుడు పొంగిపొర్లి రోడ్డుపైకి వచ్చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు శనివారం జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు కొత్త కాలువను ఏర్పాటు చేశారు. ఈ పనులు ఆదివారం పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా స్థానికులు దుర్గారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సపై వైద్యులకు అవగాహన

ఎంవీపీకాలనీ: బ్రెయిన్ స్ట్రోక్ పై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ సొసైటీ ఆఫ్ న్యూరో రేడియాలజీ , స్ట్రోక్ ఆప్డేట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ రేడియోలజిస్ట్ మెడికవర్ హాస్పటల్స్, ఐఎస్ఎన్ఆర్–2023 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శిభా శంకర్ దళాయి అధ్యక్షతన శనివారం నోవెటల్ హోటల్‌లో ఈ కాన్ఫరెన్స్ జరిగినట్లు మెడికవర్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ శిభా శంకర్ దళాయి మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ సమస్యకు చికిత్స విధానంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆధునిక వైద్య సౌకర్యాలు ఎలా ఉన్నాయి, శస్త్ర చికిత్స సమయంలో మెళకువలు ఎలా పాటించాలని అనే విషయంపై యువ వైద్యులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 30 మంది సీనియర్ డాక్టర్లు, ప్రొఫెసర్లు ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 500 మంది యువ వైద్యులు పాల్గొన్నారు. ఐఎస్ఎన్ఆర్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ గైక్వాడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అరవింద్ వర్మ డట్ల తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న వైద్యులు

ఏయూ సమాచారం

పోష్ చట్టంపై అవగాహన

ఏయూ క్యాంపస్: పని చేసే స్థలంలో మహిళలపై వేధింపుల నియంత్రణ చట్టం(పోష్ చట్టం)పై ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూజీసీ సూచనలకు అనుగుణంగా పోష్ యాక్ట్ 2013పై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఏయూ సైన్స్, ఆర్ట్స్ కళాశాలలతో పాటు అనుబంధ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించినట్లు కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ పి.ఉష తెలిపారు.



పుస్తకాన్ని బహూకరిస్తున్న ఐపీసీ సభ్యులు

పుస్తకం బహూకరణ

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ అహ్మదీయ కమ్యూనిటీ ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య కె.సమతను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆమెకు 'ప్రపంచ సంక్షోభం–శాంతి మార్గము'పుస్తకాన్ని బహూకరించారు. అహ్మదీయ కమ్యూనిటీ 220 దేశాల శాంతి స్థాపన కోరుతూ చేస్తున్న కార్యక్రమాలను వీసీకి వివరించారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



మాట్లాడుతున్న డాక్టర్ సీతారాం

విశాఖ విద్య: పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు 'పాఠశాలల్లో విద్యార్థులకు చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలు–సైబర్ సెక్యూరిటీ అంశాలు' పై జిల్లా స్థాయి వర్క్ షాప్ శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో గొండు సీతారాం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తాగునీరు మొదలుకొని మరుగు దొడ్లు, పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులపై అందే ప్రతీ ఫిర్యాదును సమయ స్ఫూర్తితో స్వీకరించి వారిలో అభద్రతాభావం నెలకొల్పకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. స్కూల్ బస్ డ్రైవర్లు, కండక్టర్లపై ఫిర్యాదులొస్తే వాటిని స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెలను ప్రతీ పాఠశాలలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సైబర్ సెక్యూరిటీ, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీఈఆర్టీ చైల్డ్ సేఫ్టీ రాష్ట్ర నోడల్ అధికారి ఎం.సోమశేఖర్ మాట్లాడుతూ జాతీయ,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ల ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, భద్రతా ప్రమాణాల్లో భాగంగా వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధి నిహారిక, భీమిలి డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ రవి, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.